క్లుప్తంగా

విద్యుత్ సరఫరా పునరుద్ధరించండి

బోథ్: వర్షాకాలంలో కురిసిన భారీ వర్షాలకు మండలంలోని మర్లపెల్లి వాగులు ప్రవహించి విద్యుత్ స్తంభాలు విరిపోయాయి. దీంతో రైతుల వ్యవసాయ క్షేత్రాలకు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. అయితే వచ్చే యాసంగిలో పంటలు పండించాలంటే సాగునీరు అవసరమున్న నేపథ్యంలో విద్యుత్ సరఫరాను అధికారులు పునరుద్ధరించాలని రైతులు కోరుతున్నారు.

డబ్బు పొదుపు చేసుకోవాలి



బహుమతులు అందజేస్తున్న వెంకట్రామిరెడ్డి

ఎదులాపురం: డబ్బును పొదుపు చేసుకోవాలని, ఆ సొమ్ము భవిష్యత్ అవసరాలను తీర్చుకోవాలని తెలంగాణ గ్రామీణ బ్యాంకు ఆదిలాబాద్ ప్రాంతీయ అధికారి వెంకట్రావిఎరెడ్డి అన్నారు. సోమవారం రణదీవేనగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో టీజీబీ రాంపూర్ బ్రాంచ్ ఆధ్వర్యంలో స్వచ్ఛత, ఈ- సేవా కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన సదస్సు, కళాజాత నిర్వహించారు. పొదుపు ఖాతా, డిజిటల్ లావాదేవీలు, సైబర్ నేరాల గురించి వివరించారు. సీనియర్ మేనేజర్ హబీబుల్లా, రాంపూర్ శాఖ ఉద్యోగులు ఫణి, విక్రమ్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

నార్నూర్: మండల కేంద్రంలో నవంబర్ 2న నిర్వహించే కుమురం భీం వర్ధంతిని విజయవంతం చేయాలని ఐటీడీఏ పాలక మండలి డైరెక్టర్ మాడవి మాన్కు కోరారు. సోమవారం మండల కేంద్రంలోని కుమురం భీం చౌక్ వద్ద మాట్లాడారు. ఆదివాసీ గిరిజనుల హక్కుల సాధన కోసం పోరాటాలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ మెస్రం రూప్‌దేవ్, గంగాపూర్ భీంరావు పటేల్, మాన్కాపూర్ ఉప సర్పంచ్ రూప్‌దేవ్ పాల్గొన్నారు.

యుగతులసి పార్టీకి పట్టం కట్టండి

ఎదులాపురం: గో సంరక్షణే ధ్యేయంగా, గోవును జాతీయ ప్రాణిగా ప్రకటించాలని డిమాండ్‌తో ఎన్నికల బరిలో ఉంటున్న యుగతులసి పార్టీకి పట్టం కట్టాలని పార్టీ అభ్యర్థి, గోమాత సేవ ఫౌండేషన్ చైర్మన్ సురేశ్ అన్నారు. జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో సోమవారం మాట్లాడారు. రోజురోజుకూ అంతరించిపోతున్న గోమాత సంరక్షణకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. గోమాత సంరక్షణ కోసం అనేక చట్టాలు ఉన్న వాటిని అమలు చేయడంలో ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆరోపించారు. హిందూ బంధువులు, గో సంరక్షకులు, ఆశీర్వదించి అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు. ఇందులో ఫౌండేషన్ ఉపాధ్యక్షుడు రాకేశ్, కార్యదర్శి సంతోష్, సాయిక్రిష్ణ, రాజశేఖర్, రాజురెడ్డి, జగన్, హిమాన్ష్, అమూల్ పాల్గొన్నారు.

'యుద్ధభేరి' విజయవంతం చేయండి

బేల: అన్ని రాజకీయ పార్టీలు మాదిగ డిక్లరేషన్ ప్రకటించాలని డిమాండ్ చేస్తూ.. నవంబర్ 5న హైదారాబాద్‌లో నిర్వహించే మాదిగల యుద్ధభేరిని విజయవంతం చేయాలని టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కదరపు ప్రవీణ్ కోరారు. సోమవారం మండల కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో కరపత్రాలు ఆవిష్కరించారు. పార్లమెంటు సమావేశాల్లో ఎస్సీ వర్గీకరణ బిల్లును ప్రవేశపెట్టే విధంగా అన్ని రాజకీయ పార్టీలు అధికార పార్టీపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. నాయకులు నడుకుంటి పెంటన్న, కృష్ణ పెల్లి అంకుష్, యుమ్ముర్ల గణేష్, అక్షయ్, నవనీత్, అశోక్, దిలీప్, రతన్ పాల్గొన్నారు.

'కాంగ్రెస్, బీజేపీ మాటలను నమ్మొద్దు'

నేరడిగొండ: కాంగ్రెస్, బీజేపీ మాటలను ప్రజలు నమ్మొద్దని మాజీ జెడ్పీటీసీ గడ్డం భీంరెడ్డి, కుమారి పీఏసీఎస్ చైర్మన్ మందుల రమేశ్ అన్నారు. సోమవారం మండలంలోని కుమారి, కుప్టి, తర్నం గ్రామాల్లో ఇంటింటికీ తిరుగుతూ బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని కోరారు. సీఎం కేసీఆర్ చేపడుతున్న సంక్షేమ పథకాలను వివరించారు. మండల కన్వీనర్ అల్లూరి శివారెడ్డి, సర్పంచ్‌లు ఓర్స రాజు యాదవ్, విశాల్, కమలాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

నేరడిగొండ: మండలంలోని లఖంపూర్ జాతీయ రహదారిపై సోమవారం సాయంత్రం రెండు బైక్‌లు ఢీకొని ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల్లోకి వెళితే.. ఇచ్చోడ మండలం పట్వారిగూడకు చెందిన రవితేజ, నవీన్‌లు కుంటాల జలపాతాన్ని వీక్షించేందుకు వెళ్లారు. తిరుగు ప్రయాణంలో ద్విచక్ర వాహనంపై ఇచ్చోడకు వెళ్తుండగా లఖంపూర్ గ్రామానికి చెందిన సుదర్శన్ వెనుక నుంచి ఢీకొన్నారు. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. వీరిని 108లో రిమ్స్ ఆస్పత్రికి తరలించారు.

భయం.. భయంగా చదువులు

- కేజీబీవీ చుట్టూ ప్రహరీ కరువు
- పాఠశాల ఆవరణలోకి వస్తున్న పశువులు
- ఇబ్బంది పడుతున్న విద్యార్థినులు



ప్రహరీ లేని తాంసి కేజీబీవీ

తాంసి: పేద కుటుంబాలకు చెందిన బాలికలతో పాటు అర్ధాంతరంగా చదువు మానేసిన బాలికలకు విద్యను అందించాలనే ఉద్దేశంతో ప్రభుత్వం కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాలను ఏర్పాటు చేసింది. వీటి ద్వారా మెరుగైన విద్యను అందించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. విద్యార్థులకు ఉచిత విద్య, వసతి, భోజనం, దుస్తులు అందజేస్తూ.. చదువులో రాణించేందుకు ప్రభుత్వం ప్రోత్సహిస్తుంది. అయితే ఇంత వరకు బాగానే ఉన్నా.. కస్తూరిబాలో సరైన వసతులు లేక విద్యార్థినులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. విద్యార్థులకు కల్పించాల్సిన కనీస సౌకర్యాలను అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రభుత్వ లక్ష్యం నీరుగారుతోంది. తాంసి మండల కేంద్రంలోని కేజీబీవీపై అధికారుల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారు. నిర్మించి ఏళ్లు గడుస్తున్నా.. పాఠశాల చుట్టూ ఇంతవరకు ప్రహరీ నిర్మించలేదు.

విద్యార్థినులకు రక్షణ కరువు..

కస్తూరిబాలో 160 మందికి పైగా విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల చుట్టూ ప్రహరీ నిర్మించకపోవడంతో విద్యార్థులకు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. కేజీబీవీ ఎదుట నుంచే పంటచేలకు వెళ్లే దారి ఉంది. రైతుల ఎడ్లబండ్లు, పశువులు కేజీబీవీ ఆవరణ ముందు నుంచే వెళ్తుంటాయి. దీంతో పాఠశాల ఆవరణ అధ్వానంగా మారుతోంది. పక్కనే ఉన్న ఆశ్రమోన్నత పాఠశాల ప్రహరీ ఎత్తు లేకపోవడంతో కేజీబీవీ విద్యార్థినులకు రక్షణ కరువైంది.

క్రీడలకు దూరం..

కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం ఎదుట ప్రహరీ లేకపోవడంతో విద్యార్థులు క్రీడలకు దూరమవుతున్నారు. విద్యార్థులకు శారీరక ఉల్లాసం కోసం క్రీడలు తప్పనిసరి అవసరం. కానీ విద్యార్థులు ఆటస్థలం లేక క్రీడలు ఆడలేకపోతున్నారు. పక్కనే ప్రభుత్వ కళాశాల, జిల్లా పరిషత్ పాఠశాల ఉండడంతో ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కేజీబీవీ చుట్టూ ప్రహరీ నిర్మించాలని విద్యార్థులు కోరుతున్నారు.

అధికారులకు విన్నవించాం

కేజీబీవీ వసతిగృహానికి ఎదుట ప్రహరీ నిర్మాణం చేపట్టాలని అధికారుల దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. ప్రహరీ నిర్మాణం చేపట్టాలని అధికారులకు విన్నవించాం. ఉన్నతాధికారులు స్పందించి ప్రహరీ నిర్మిస్తే విద్యార్థుల కష్టాలు దూరమవుతాయి.

– సౌజన్య, కేజీబీవీ, ఇన్‌చార్జి ప్రత్యేకాధికారి

రక్షణ లేకుండా ఉండాల్సి వస్తోంది



కేజీబీవీ వసతిగృహం ఎదుట ప్రహరీ నిర్మాణం లేకపోవడంతో ఎలాంటి రక్షణ లేదు. పాఠశాల నుంచి బయటకు వేళ్లే పరిస్థితి లేదు. బయటకు వేళ్లాలంటే పశువులు రావడంతో భయపడుతున్నాం.

– ప్రగతి, పదో తరగతి విద్యార్థి

కార్యకర్తలే బీజేపీకి బలం



బైక్ ర్యాలీలో పాల్గొన్న ఎంపీ సోయం, నాయకులు

- ఎంపీ సోయం బాపురావు

గుడిహత్నూర్: కార్యకర్తలే బీజేపీకి బలమని బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎంపీ సోయం బాపురావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని పురాతన శివాలయాన్ని దర్శించుకొని ప్రచారం మొదలుపెట్టారు. సుమారు 500 మంది కార్యకర్తలతో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. కేసీఆర్ కుటుంబం మళ్లీ ప్రజలను మోసం చేసేందుకు చూస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా ఎన్నికల ఇన్‌చార్జి, మహారాష్ట్ర ఎమ్మెల్సీ ప్రవీణ్ జురేకర్, జెడ్పీటీసీ పతంగే బ్రహ్మనంద్, ఎంపీపీ భరత్, జాడి సుభాష్, కేంద్రే లక్ష్మణ్, జీవీ రమణ, అశోక్ ముస్తాపురే, ఆర్యన్ మహరాజ్, పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి

ఇచ్చోడ: బీజేపీ గెలుపు కోసం కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలని ఎంపీ సోయం బాపురావు అన్నారు. సోమవారం బైక్ ర్యాలీ మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా అంబేద్కర్, శివాజీ, కుమురం భీం విగ్రహాలకు నివాళులర్పించారు. కాంగ్రెస్ మోసపూరిత హామీలతో ప్రజలను మోసం చేస్తోందన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు గుమ్మడి భీంరెడ్డి, జిల్లా కార్యదర్శి కొల్లూరి చంద్రశేఖర్, మండల అధ్యక్షుడు కేంద్రే నారాయణ పాల్గొన్నారు.

బోథ్: బోథ్‌లో ఎంపీ సోయం బాపురావు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. బీజేపీ అభ్యర్థిగా ప్రకటించిన తరువాత మొట్టమొదటిసారిగా నాయకులు, కార్యకర్తలతో కలిసి ర్యాలీ నిర్వహించారు. గుడిహత్నూర్ నుంచి ప్రారంభమైన ర్యాలీ ఇచ్చోడ, బజార్‌హత్నూర్, సొనాల మీదుగా బోథ్‌కు చేరుకుంది. బోథ్ బీజేపీ టికెట్ ఆశించిన సాకటి దశరథ్ కూడా ర్యాలీలో పాల్గొన్నారు. పార్టీ నిర్ణయాన్ని గౌరవించి సోయం బాపురావు గెలుపునకు కృషి చేస్తామన్నారు.

బజార్‌హత్నూర్: అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించి, ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తుందని బోథ్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఆదిలాబాద్ ఎంపీ సభ్యుడు సోయం బాపురావు అన్నారు. సోమవారం మండలంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. శివాజీ, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నాయకులు గొర్ల రాజు, సాకటి దశరథ్, బత్తిని సుధాకర్, కేవల్ సింగ్, పోరెడ్డి శ్రీనివాస్, సంతోష్ పాల్గొన్నారు.

'కార్యకర్తలను బెదిరిస్తే ఊరుకోం'

నేరడిగొండ: బీజేపీ కార్యకర్తల్లారా బీఆర్ఎస్ నాయకుల బెదిరింపులకు భయపడకండి. సోయం మీ వెంటే ఉంటాడని గుర్తుంచుకోండి అని ఆదిలాబాద్ ఎంపీ, బీజేపీ బోథ్ ఎమ్మెల్యే అభ్యర్థి సోయం బాపురావు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన బైక్ ర్యాలీలో పాల్గొన్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సూర్య గార్డెన్‌లో మాట్లాడారు. కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి సాకటి దశరథ్, రైల్వే బోర్డు మెంబర్ జీవీ రమణ, సూర్యకాంత్ గిత్తే, ఆర్యన్ మహరాజ్, బ్రహ్మనందం, బాబురావు పటేల్, గొర్ల రాజు యాదవ్ పాల్గొన్నారు.

కుచులాపూర్‌లో డీఎస్పీ ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బోథ్: మండల కేంద్రంలోని కుచులాపూర్ గ్రామంలో సోమవారం ధర్మసమాజ్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బీఆర్ఎస్, బీజేపీ, సీపీఐ, సీపీఎం, వైఎస్సార్‌టీపీ అగ్రకులాల పార్టీలన్నారు. ఇప్పటికే వారు ఎస్సీ, ఎస్టీ, బీసీలకు టికెట్ల కేటాయింపులో అన్యాయం చేశారని ఆరోపించారు. ధర్మసమాజ్ పార్టీ బడుగుల ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తోందన్నారు. డీఎస్పీ అభ్యర్థి ఉయికె ఉమేష్‌ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ప్రచార కమిటీ అధ్యక్షుడు దర్శనాల అశోక్, కొండమడుగు గణేష్, వెంకటేశ్, రమేశ్, బడుగు రాజేశ్వర్, శేఖర్, లక్ష్మణ్, రాజు, కార్తీక్, రఘువీర్ పాల్గొన్నారు.

'పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే చర్యలు'



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

బోథ్: పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే చర్యలు తప్పవని జిల్లా కిసాన్‌సెల్ అధ్యక్షుడు బూర్గుల మల్లేష్, పట్టణ అధ్యక్షుడు సల్ల రవి హెచ్చరించారు. సోమవారం మండల కేంద్రంలో వారు మాట్లాడారు. కాంగ్రెస్ బోథ్ అభ్యర్థిగా వన్నెల అశోక్‌ను అధిష్టానం ప్రకటించిందని, ఆయన గెలుపు కోసం కార్యకర్తలు కృషి చేయాలన్నారు. మంగళవారం వన్నెల అశోక్ బోథ్‌కు రానున్నారని, ఉదయం 11 గంటలకు నిర్వహించే ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పరిచయ గార్డెన్‌లో కార్యకర్తలతో సమావేశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు మల్లేపూల సత్యనారాయణ, అబ్రార్, చంద్రశేఖర్, రహీమొద్దీన్, ఇమ్రాన్, రాంలక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

'దుండగులను కఠినంగా శిక్షించాలి'

ఎదులాపురం: ఉట్నూర్ మండలం దొంగచింత గ్రామ పంచాయతీ పరిధిలో ఆదివాసీ అమ్మాయిపై అత్యాచారం చేసి, హత్య చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి పూసం సచిన్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఆదివాసీ మహిళలు, బాలికలపై రోజురోజుకూ దాడులు, హత్యలు పెరుగుతున్నాయన్నారు. అయినా.. ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

'బీఆర్ఎస్‌ను నమ్మి మోసపోవద్దు'



కండువా కప్పుతున్న పాయల్ శంకర్

జైనథ్: బీఆర్ఎస్‌ను నమ్మి ప్రజలు మళ్లీ మోస పోవద్దని ఆదిలాబాద్ బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాయల్ శంకర్ అన్నారు. సోమవారం మండలంలోని గూడ గ్రామంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరుగుతూ బీజేపీ పథకాలను వివరించారు. గ్రామస్తులు, యువకులు బీజేపీలో చేరగా.. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. డబుల్ బెడ్‌రూం ఇళ్లు, ఇంటింటికీ ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన ఎమ్మెల్యే జోగు రామన్న, గెలిచిన తరువాత హామీలను విస్మరించారని మండిపడ్డారు. ఒక్కసారి అవకాశం ఇస్తే, ఆదిలాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసి చూపిస్తానని అన్నారు. ఆయన వెంట మండల అధ్యక్షుడు కట్కం రాందాస్, నాయకులు లోక ప్రవీణ్ రెడ్డి, చిల్కూరి జ్యోతి, కాళ్ల మోహన్, రమేశ్ రెడ్డి, అశోక్‌రెడ్డి, రతన్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఆదరించండి.. అభివృద్ధి చేస్తా



మాట్లాడుతున్న కంది శ్రీనివాస్‌రెడ్డి

కైలాస్‌నగర్: అసెంబ్లీ ఎనికల్లో ఆదరిస్తే అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ప్రజాసేవ భవన్‌లో పట్టణంలోని బొక్కలగూడ ఇందిరానగర్, రాంనగర్, రవీంద్రనగర్, భాగ్యనగర్, రణదివెనగర్, తిర్పెల్లి కాలనీవాసులు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. చేతి గుర్తుకు ఓటేసి ఎమ్మెల్యే జోగు రామన్నను ఓడించాలన్నారు. ఈకార్యక్రమంలో డీసీసీబీ మాజీ అధ్యక్షుడు ముడుపు దామోదర్ రెడ్డి, బేల మాజీ సర్పంచ్ పూసం ప్రభాకర్, డీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ భూపెల్లి శ్రీధర్, సంతోష్, నాగర్కర్ శంకర్, సుజాత్ అలీ, రాజ్ మహమ్మద్, తదితరులు పాల్గొన్నారు.

చాదర్‌ను సమర్పించిన శ్రీనివాసరెడ్డి

ఆదిలాబాద్‌రూరల్: మండలంలోని చాందా (టి)లో గల హజ్రత్ సయ్యద్ సిరాజ్ ఉద్దీన్ రాజంషావలి దర్గాను కాంగ్రెస్ ఆదిలాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి కంది శ్రీనివాసరెడ్డి సోమవారం దర్శించుకొని చాదర్‌ను సమర్పించారు. ఈసందర్భంగా ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో దర్గా మతపెద్దలు మహమ్మద్, మక్బుల్ హైమ్మద్, రశీద్ ఖాన్, ఆసిఫ్, యాకుబ్, షకీల్, భూపెల్లి శ్రీధర్, ఆనంద్‌రావు, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

'టికెట్ల కేటాయింపులో మహిళలకు అన్యాయం'



మాట్లాడుతున్న జెడ్పీటీసీ చారులత రాథోడ్

ఉట్నూర్‌రూరల్: కాంగ్రెస్ టికెట్ల కేటాయింపులో మహిళలకు అన్యాయం జరిగిందని ఉట్నూర్ జెడ్పీటీసీ చారులత రాథోడ్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలో మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలో కొత్తగా పార్టీలో చేరిన వారికి టికెట్ కేటాయించడం సరికాదన్నారు. సీనియర్లను పక్కన పెట్టి, ఆర్థికంగా బలంగా ఉన్న వారికే టికెట్లు ఇచ్చారని ఆరోపించారు. సర్వేలను సైతం అధిష్టానం పట్టించుకోలేదన్నారు. త్వరలో తన కార్యచరణను ప్రకటిస్తానని తెలిపారు. సమావేశంలో నాయకులు చంద్రయ్య, ఇక్బాల్, పుర్కబాపురావు, పెందూర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెప్పాలి

- ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న



మహిళలతో కలిసి స్టెప్పులేస్తున్న ఎమ్మెల్యే రామన్న

జైనథ్: అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను గెలిపించి, ప్రతిపక్షాలకు తగిన బుద్ధి చెప్పాలని బీఆర్ఎస్ అభ్యర్థి, ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న అన్నారు. సోమవారం మండలంలోని జైనథ్, దీపాయిగూడ, ఆనంద్‌పూర్, కూర, కరంజి, ఉమ్రి, ఖాప్రి, బెల్లూరి, బెల్గాం, మాకోడ గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముందుగా మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీనారాయణ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం బస్టాండ్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించారు. వివిధ గ్రామాల్లో నిర్వహించిన రోడ్ షోలో పాల్గొని, మహిళలతో కలిసి స్టెప్పులేశారు. బీఆర్ఎస్ అధికారంలోకి వస్తే మహిళలు రూ. 3వేల జీవన భృతి, అందరికి రూ. 5లక్షల బీమా, రూ. 400లకే గ్యాస్ సిలిండర్ అందిస్తామన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు తుమ్మల వెంకట్ రెడ్డి, ఎంపీపీ మార్శెట్టి గోవర్ధన్, సర్పన్ లింగారెడ్డి, విజయ్ కుమార్, వేణు యాదవ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

అభివృద్ధిని చూసి ఓటేయండి



దాబా(కె)లో ప్రచారం చేస్తున్న నాయకులు

ఇచ్చోడ: అభివృద్ధిని చూసి ఓటేయ్యాలని ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని దాబా(కె)లో ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలను అందించిన ఘనత బీఆర్ఎస్‌కే దక్కుతుందన్నారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాగానే రూ. 5 వందలకే గ్యాస్ సిలిండర్, రేషన్‌కార్డు ఉన్న ప్రతికుటుంబానికి సన్నబియ్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు గాడ్గే సుభాష్, పురుషోత్తం రెడ్డి, దయకుమార్‌రెడ్డి, నర్వడే రమేశ్, పాండరంగ్, గంగాధర్, వెంకటేశ్, మతీన్ పాల్గొన్నారు.

జోరుగా ఎన్నికల ప్రచారం

బోథ్: మండలంలోని ఆయా గ్రామాల్లో ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. సోమవారం మండలంలోని ఘన్‌పూర్, కోట(కె), సాంగ్వి, రాంనగర్‌లో ఎంపీపీ తుల శ్రీనివాస్ ప్రచారం చేశారు. బీఆర్ఎస్ పథకాలు, మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు. గ్రామాలు మరింత అభివృద్ధి చెందాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే అధికారంలో ఉండాలన్నారు. సర్పంచుల సంఘం అద్యక్షుడు శ్రీధర్ రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ కదం ప్రశాంత్, సర్పంచులు పాల్గొన్నారు. అలాగే మండల కేంద్రంలోని సాయినగర్ కాలనీలో ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్‌కు ఓటు వేయాలని అభ్యర్థించారు. మండల కన్వీనర్ నారాయణ రెడ్డి, ఆత్మ చైర్మన్ మల్లేపూల సుభాష్, రమణ గౌడ్, గాండ్ల నారాయణ పాల్గొన్నారు.

బీఆర్ఎస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి



కూలీల వద్ద ప్రచారం చేస్తున్న నాయకులు



మేనిఫెస్టో వివరిస్తున్న అనిల్ జాదవ్

తలమడుగు: ఎన్నికల్లో బోథ్ బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎంపీ గోడం నగేశ్ అన్నారు. సోమవారం మండలంలోని ఝరి, కప్పర్‌దేవి, ఉమ్రీ, పల్సి తండా గ్రామాల్లో అనిల్ జాదవ్‌తో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బీఆర్ఎస్ మేనిఫెస్టోను ఇంటింటికీ వెళ్లి వివరించాలన్నారు. వివిధ పార్టీ నాయకులు ఇచ్చే హామీలను నమ్మవద్దన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ వెంకటేశ్, బోథ్ నియోజకవర్గ అధికార ప్రతినిధి మొట్ట కిరణ్ కుమార్, జీవన్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అభిరామ్‌రెడ్డి, చంటి, ఆశన్న యాదవ్, చంద్రకాంత్, మాధవరావు, గంగాధర్, ప్రకాశ్‌రెడ్డి పాల్గొన్నారు.

పంటచేలలో ప్రచారం

తాంసి: భీంపూర్ మండలంలోని గోవింద్‌పూర్ గ్రామ శివారులో పంటచేలలో పత్తి తీస్తున్న కూలీల దగ్గరికి వెళ్లి బీఆర్ఎస్ నాయకులు ప్రచారం చేశారు. తమ అభ్యర్థిని గెలిపించాలని కోరారు. నాయకులు నితిన్, అఫ్రోజ్, కల్పప్, గంగన్న పాల్గొన్నారు.

'కర్ణాటకలో హామీల అమలులో కాంగ్రెస్ విఫలం'

కైలాస్‌నగర్: కర్ణాటక రాష్ట్రంలో ప్రజలకు ఇచ్చిన హామీల అమలులో కాంగ్రెస్ పూర్తిగా విఫలమైందని మున్సిపల్ చైర్మన్ జోగు ప్రేమేందర్ ఆరోపించారు. సోమవారం పట్టణంలోనీ శాంతినగర్ కాలనీలో పర్యటించారు. ఇంటింటికీ తిరుగుతూ కారు గుర్తుకు ఓటు వేసి, ఎమ్మెల్యే జోగు రామన్నను గెలిపించాలని కోరారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందన్నారు. బూటకపు హామీలను ఇచ్చి మభ్యపెట్టే కాంగ్రెస్‌కు ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ అలాల్ అజయ్, అడప తిరుపతి, ఇబ్బు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధిష్టానం పునరాలోచించాలి



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఇచ్చోడ: బోథ్ అసెంబ్లీ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికలో కాంగ్రెస్ అధిష్టానం పునరాలోచించాలని కాంగ్రెస్ నియోజవర్గ నాయకులు ఆడే గజేందర్ అన్నారు. ఐదు సంవత్సరాలుగా పార్టీ అభివృద్ధి కోసం అహర్నిశలు కష్టపడి పనిచేసే నాయకులను కాకుండా పార్టీకి సంబంధం లేని వారికి టికెట్ ఇవ్వడం సరికాదన్నారు. పార్టీ నిర్మాణం, పటిష్టత కోసం ఎంతోగానో కృషి చేసిన నాయకులను పట్టించుకోలేదని ఆరోపించారు. అధిష్టానం తగు నిర్ణయం తీసుకొని కాంగ్రెస్‌కు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే పార్టీకి నష్టం జరుగుతుందన్నారు. సమావేశంలో నాయకులు నరేశ్‌జాదవ్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు మహిముద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

గడ్డం తీసి.. ఓటు అభ్యర్థించి



అసెంబ్లీ ఎన్నికలకు తక్కువ సమయం ఉండడంతో నాయకులు, కార్యకర్తలు వినూత్న ప్రచారం చేస్తున్నారు. సోమవారం తాంసి మండలంలోని బండల్ నాగాపూర్ గ్రామంలో జెడ్పీటీసీ రాజు బీఆర్ఎస్ అభ్యర్థి అనిల్ జాదవ్‌ను గెలిపించాలని గడ్డం తీస్తూ ఓటు అభ్యర్థించారు.

– తాంసి